

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	560.70 (234.0796)	65.522	1.800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.34 (3.53)	-	139.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.017 (18.2313)	-	5.000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో సేవోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులన అధిష్ఠింపజేసి విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. ముందుగా ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యార్చనలు చేపట్టారు. పాత గుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,95,248 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

ప్రసాదాల టికెట్ కౌంటర్ ఏర్పాటు

కొండపైన భక్తులు ప్రసాద టికెట్లు, ప్రసాదాలు తీసుకునేందుకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. శివాలయం ఎదురుగా కౌంటర్‌లో టికెట్ పొంది ప్రసాదాల కోసం 50 మెట్లెక్కి దిగాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులు తొలగించేందుకు ఈవో ఎస్.వెంకట్రావు ప్రత్యేక చొరవతో ఆలయ ఈ శాన్య దిక్కులో కొత్తగా నిర్మాణం చేపట్టారు. అఖండ దీపారాధన చేసే ప్రదేశం పక్కన కొత్తగా టికెట్ కౌంటర్ కోసం ప్రత్యేకంగా సుమారు 11 రేకులతో నిర్మిస్తున్నారు. తిరువీధుల్లో ప్రసాదాల టికెట్ కౌంటర్ ఏర్పాటును భక్తులు స్వాగతిస్తున్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ నజర్

- బీబీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు
- పలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నగదు స్వాధీనం
- గతంలోనూ యాదగిరిగుట్ట ఎస్ఆర్వో కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన బీబీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

అవినీతి అధికారులను పట్టుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ రంగంలోకి దిగింది. అత్యధికంగా ఆర్థిక లావాదేవీలు జరిగే, అవినీతికి ఆస్కారం ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఏక కాలంలో సోదాలు చేసింది. ఇప్పటికే పలు ఆరోపణలున్న బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదులు అందుతున్నాయి. రిజిస్ట్రేషన్ సందర్భంగా ఎంతో కొంత ముట్టజెప్పనిదే డాక్యుమెంట్లు ఇవ్వడంలేదని ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం బీబీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. ఈ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా డాక్యుమెంట్ రైటర్లు ఉండటాన్ని గుర్తించారు. పలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది వద్ద ఉన్న నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. లెక్కకురాని (డాక్యుమెంట్లకు సంబంధంలేని) డబ్బులు సిబ్బంది వద్ద రూ.61వేలు ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా ప్రజల నుంచి డబ్బులు ఎందుకు డిమాండ్ చేస్తున్నారన్న కారణాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని స్వాధీనం చేసుకుని విచారణ చేపడుతున్నారు. జిల్లాలోని బీబీనగర్ ఎస్ఆర్వో కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడంతో జిల్లావ్యాప్తంగా మరోసారి కలకలం సృష్టించింది. జిల్లాలో భువనగిరి, బీబీనగర్, రామన్నపేట, చౌటుప్పల్, మోత్కురు, యాదగిరిగుట్ట ఎస్ఆర్వో కార్యాలయాల్లో తనిఖీలు చేస్తారన్న ప్రచారం జరిగింది. ఏసీ బీ అధికారులు బీబీనగర్‌లో ఎస్ఆర్వో కార్యాలయంలోనే సోదాలు జరిపారు.

ప్లాట్ల క్రయ, విక్రయాలపై ..

నగరానికి చేరువలో ఉన్న శివారు ప్రాంతాల్లో స్థిరాస్థి వ్యాపారం ఊపందుకుంది. నిత్యం వందల్లో ప్లాట్ల క్రయ, విక్రయాలు కొనసాగుతుంటాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లు సబ్ రిజిస్ట్రార్లకు కల్పతరువుగా మారినట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్లాట్లకు సంబంధించి ఏమైనా చిన్నపాటి పత్రాలు లేదంటే డబ్బులకు ఆశపడి నిబంధనలకు విరుద్ధంగా సబ్‌రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో పదేళ్ల క్రితం వరకు రోడ్డుకు ఇరువైపులా పచ్చని పొలాలు కన్పించేవి. నగరం విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లోనూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. జిల్లా నగరానికి సమీపంలో ఉండటంతో పాటు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈనేపథ్యంలో శివారు ప్రాంతంలో కొత్త లే అవుట్లు, వెంచర్లు పుట్టుకొచ్చాయి. ఈ ప్రాంతంలో...

- మిగతా 8వ పేజీలో...

గతంలో గుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు

గతంలోనూ యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ దేవానంద్ గ్రామపంచాయతీ లేఅవుట్‌లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసే విషయంలో డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.20వేలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు. అదేవిధంగా యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీలు, రిజిస్ట్రేషన్లకు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఓ ఉద్యోగిపై చర్యలు తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితం ఏసీబీ సోదాలు జరిగాయి. రికార్డులు సీజ్‌చేసి అధికారులను బదిలీచేశారు. అవినీతి నిరోధక శాఖ ఎన్నిసార్లు దాడులు చేసినా..., ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంది. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. 2008నుంచి 2020 వరకు ఏర్పాటైన పలు లేఅవుట్లలో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ కాకుండా మిగిలిపోయిన వాటిని వ్యాపారులు విక్రయించారు. నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ కడితేనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాలి. తక్కువ ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు యోచిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని పలువురు సబ్‌రిజిస్ట్రార్లు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు పీడిస్తుండటంతో ప్రజలు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. కార్యాలయాలపై ఎన్నిసార్లు దాడి చేసినా, అధికారుల్లో మాత్రం మార్పు రావడంలేదు. మేమింతే అనే భావనలో ఉంటున్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

ఆత్మకూరు(ఎం), జూన్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు బిల్లుల చెల్లింపులో సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి జి.సురేష్ హెచ్చరించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి, విజిలెన్స్ మేనేజర్ ఆదిత్యవర్ధన్, ఎంపీడీవో రాములునాయక్, ఎస్ఆర్‌పీ నర్సయ్య, ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- పేదోడి సొంతింటి కల సాకారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి
- వార్డు ఆఫీసర్లు జవాబుదారీగా వ్యవహరించాలి
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి పనులపై సమీక్షించి మాట్లాడారు. పేదోడి సొంతింటి కల సాకారం చేసేందుకు అధికారులు, వ్యాపారులు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సకాలంలో లక్ష్యాన్ని సాధించి జిల్లాను అగ్రగామిగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావు, జడ్పీ సీఈవో ఎస్.శోభారాణి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో నాగిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ విజయ్ సింగ్ అధికారులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: వార్డు ఆఫీసర్లు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మునిసిపాలిటీ ఒకటో వార్డు కార్యాలయాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై వార్డు ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్యామహేందర్ రెడ్డి, కమిషనర్ మిర్యాల లింగస్వామి, మాజీ కౌన్సిలర్లు జి.అరుణారాజేష్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్, ఎరుకల హేమేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు కృషి

యాదగిరిగుట్ట: అంతర్జాతీయ దివ్యక్షేత్రం యాదగిరిగుట్టలో అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థాన పరిధిలో పాత గోశాల ఆవరణలో గురువారం నూతన అగ్నిమాపక కేంద్ర భవనం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి విప్ ప్రారంభించి మాట్లాడారు. దేవస్థాన పరిధి పాత గోశాల ప్రాంతంలో 1.14 ఎకరాల విస్తీర్ణంలో రూ. 60లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి, కలెక్టర్ ఎం.హనుమంతరావు, రీజినల్ అగ్నిమాపక అధికారి బి. హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ సత్యం అన్నారు. ఆలేరులో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళ శక్తి సంబురాల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ప్రపంచ జనాభా వారోత్సవంలో భాగంగా ఈ నెల 11 నుంచి 18 వరకు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న హాస్టల్ నిద్రలో భాగంగా ఈ విద్యాసంవత్సరం మెడికల్ ఆఫీసర్లు కూడా అధికారులతోపాటు హాస్టల్ నిద్ర చేయాలన్నారు. సిబ్బంది రోగులకు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంహెచ్‌వో మనోహర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో మెరుగైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు యశోద, శిల్పిని, రామకృష్ణ, సుమన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారాలతో అధిక లాభాలు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



స్ట్రీట్ ఫుడ్‌ను పరిశీలిస్తున్న భాస్కర్‌రావు

భువనగిరి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారాలతో మహిళలు అధిక లాభాలు పొందవచ్చునని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 46వ రోజు గురువారం భువనగిరిలో పట్టణ మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన వీధివ్యాపార ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెఫ్‌లకంటే రుచికరంగా వండే నైపుణ్యం మహిళలకు ఉంటుందన్నారు. స్ట్రీట్ ఫుడ్ అంటే కేవలం చైనీస్ తదితర విదేశీ వంటకాలే కాదని, స్వదేశీ పానీపూరి, సంప్రదాయ ఇడ్లీ, దోశ తదితర నోరూరించే వంటకాలన్నీ స్ట్రీట్ ఫుడ్‌లో విక్రయించవచ్చన్నారు. పలు వంటకాల రుచులను చూసి అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం, డీఈ కొండల్‌రావు, ఏఈ సురేష్, మెప్మా టీఎంసీ శ్యామల, కమ్యూనిటీ ఆర్గనైజర్ పీఎస్ సువర్ణ తదితర మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు. పట్టణ ప్రణాళికలో భాగంగా 2, 7, 11, 18, 24, 29, 32వ వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్ అలీ, రెవెన్యూ అధికారి ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ రజిత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఆలేరు: విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ నాణ్యతతో కూడిన భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎర్ర లక్ష్మి, హెచ్ఎం దాసరి మంజుల, ఉపాధ్యాయులు దూడల వెంకటేశ్, పోరెడ్డి రంగయ్య, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

భూదానోద్యమంతోనే పోచంపల్లికి ఖండాంతర ఖ్యాతి

- అఖిల భారత సర్వోదయ మండలి అధ్యక్షుడు అరవిందారెడ్డి



రామచంద్రారెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అరవిందారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెదిరె రామచంద్రారెడ్డి త్యాగం, ఆచార్య వినోబాభావే కృషి ఫలితంగా పోచంపల్లికి ఖండాంతర ఖ్యాతి లభించిందని అఖిల భారత సర్వోదయ మండలి అధ్యక్షుడు వెదిరె అరవిందారెడ్డి అన్నారు. గురువారం భూదాన్ గంగోత్రి ప్రాంగణంలో వెదిరె రామచంద్రారెడ్డి 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెదిరె రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ ఆధ్యాత్మిక వారసుడైన వినోబాభావే నడయాడిన ఈ నేల ఎంతో పవిత్రమైనదని అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో కృష్ణగౌడ్, సాగర్‌రెడ్డి, కుమార్, చక్రపాణి, మల్లేష్‌గౌడ్, లింగస్వామి, లక్ష్మణ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి రమణి

యాదగిరిగుట్ట రూరల్, జూలై 17, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి రమణి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించడానికి అధ్యాపకులు తగిన బోధనా పద్ధతులు పాటిస్తూ వారిలో నైపుణ్యాన్ని మెరుగుపర్చడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో సమీక్ష నిర్వహిస్తున్న రమణి

ఎంఎంటీఎస్ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి

- రైల్వే మంత్రిని కోరిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రైల్వే మంత్రిని కలిసిన కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఘట్కేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులను షెడ్యూల్ ప్రకారం త్వరగా పూర్తిచేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. రూ.412కోట్లతో ఎంఎంటీఎస్ పనులు చేపట్టడం, మొదటి దఫాగా రూ.100కోట్లను విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి ఢిల్లీలో ఆయన కేంద్రమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. పూర్తిగా రైల్వే నిధులతో పనులను చేపట్టడం అభినందీయమన్నారు.

నేతల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి కృషి ఫలితంగానే ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భువనగిరిలో వారి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్ చిస్తీ, మునిసిపల్ మాజీ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, నాయకులు ఈరపాక నరసింహ, పడిగల ప్రదీప్, కైరంకొండ వెంకటేష్, తాడూరి నరసింహ, వెంకట్ నర్సింగ్ నాయక్, ఎండీ మజాహర్, ఎండీ అతహర్, వడిచర్ల కృష్ణ యాదవ్ పాల్గొన్నారు

సంస్థాన్‌నారాయణపురంలో 6.4 సెం.మీ.ల వర్షపాతం

యాదాద్రి, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తోంది. కొన్నిరోజులుగా ముఖం చాటేసిన వరుణుడితో వాతావరణం వేడెక్కింది. తిరిగి రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతోపాటు మోస్తరు వర్షం కురుస్తోంది. జిల్లాలో సంస్థాన్‌నారాయణపురం మండలంలో అత్యధికంగా 6.43 సెం.మీ.లవర్షపాతం నమోదైంది. అత్యల్పంగా భూదాన్‌పోచంపల్లిలో 1.0మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గత కొన్నిరోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షాలు ఊరటనివ్వనున్నాయి.

మోత్కూరు: మోత్కూరు మండలంలో బుధవారం రాత్రి, గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎండలకు వాడిపోతున్న పత్తి, కందికి ఈ వర్షం జీవం పోసినట్లయ్యింది. సుమారు 20రోజులుగా రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఎండలకు పత్తి, కంది మొక్కలు వాడిపోతున్నాయి. వర్షాలు లేక పంటలకు ఎరువులు వేయడంలేదు. ఇటు వర్షాలు లేక, అటు ఎరువులు వేయకపోవడంతో మెట్ట పంటల ఎదుగుదల ఆగిపోయి వాడిపోతున్నాయి. ఈ దశలో వర్షం కురవడంతో రైతులు ఆనందపడుతున్నారు. శుక్రవారం నుంచి పత్తి, కంది మొక్కలు ఎరువులు వేయవచ్చంటున్నారు. ఏదేమైనా నాలుగైదు భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లోకి కొంచమైన నీరు వస్తేనే వ్యవసాయం సాగుతుందంటూ భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.



భువనగిరి పట్టణంలో కురుస్తున్న వాన

నారి చేతిలో సిరిసంపద

- ధాన్యం సేకరణ ద్వారా మహిళా సంఘాలకు భారీగా కమీషన్
- యాసంగిలో 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రూ.3.44 కోట్ల కమీషన్ పొందిన మహిళా సంఘాలు

మహిళా ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ధాన్యం సేకరణను మహిళా సంఘాలకు అప్పగించి, వారు ఆర్థికంగా పరిపుష్టి సాధించేందుకు సహకరిస్తోంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుచేసి, మిల్లులకు తరలిస్తున్నారు. కొనుగోలు ప్రక్రియతోనే వచ్చే కమీషన్‌తో ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)



స్పిల్‌వే శాశ్వత మరమ్మతులకు చర్యలు

● ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్



సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేను పరిశీలిస్తున్న ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్, అధికారులు

నాగార్జునసాగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేకు శాశ్వత మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఓఅండ్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయిలెనెన్స్) ఈఎన్‌సీ శ్రీనివాస్ తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పరిశీలన భాగంగా గురువారం ఆయన సాగర్ ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, క్రస్ట్ గేట్లు స్పిల్‌వే, ఎడమ కాల్వ, ఎర్త్ డ్యామ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేకు శాశ్వత మరమ్మతుల కోసం ఇప్పటికే పలు కంపెనీలతో కలిసి పరిశీలించి చర్చించామని, ఏ ఒక్క కంపెనీ కూడా మరమ్మతులకు ముందుకు రాలేదన్నారు. ఇకపై ప్రతి ఏటా స్పిల్‌వేపై పడిన గుంతలను వెంటనే పూడ్చివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఏడాది మరమ్మతులు చేపట్టడానికి స్పిల్‌వే వద్ద అటు ఇటు కదిలే క్రేన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్యాలరీలను పరిశీలించి గ్యాలరీలోని ప్లోరస్ హోల్స్‌లో (ఊటనీరు బయటకు వచ్చే మార్గం) పేరుకుపోయిన కాల్షియంను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాజెక్టు నిర్వహణలో సమస్యలుంటే పరిష్కరిస్తాం

క్రస్ట్ గేట్లు ఎత్తడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్వహణలో ఏ చిన్న సమస్య ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం విజయవిహార్ అతిథి గృహంలో ప్రాజెక్టు ఇంజనీర్లతో కలిసి సమీక్ష ఏర్పాటుచేశారు. ఈ సమీక్షలో నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిడమనూరు మండలం తుంగపాడు వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎడమ కాల్వ ఆధునికీకరణ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఇంచార్జీ ఎస్ఈ మల్లికార్జున్‌రావు, ఈఈలు వెంకటయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మోత్కూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ కేంద్రంలో ఇందిరానగర్ కాలనీకి చెందిన మున్నా(22) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్నా గతంలో ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోగా, ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో అతనిపై వేధింపుల కేసు నమోదు అయ్యిందని, ఆ కేసులో అతను జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై వచ్చాడని ఎస్‌ఐ తెలిపారు. అప్పటి నుంచి మనస్తాపంతో బాధపడుతూనే ఉన్నాడని, దీంతో గురువారం అద్దె ఇంట్లోని స్నానాల గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. మున్నా తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడిగా నర్సింహ

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సింహ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసకావొద్దని తన పాటల ద్వారా చైతన్య పరుస్తున్నారు.

ఆకట్టుకున్న 'స్వేచ్ఛ, సంధ్యా వెలుగులు'





స్వేచ్ఛ నాటికలోని సన్నివేశాలు

నల్లగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. మూడవ రోజు కార్యక్రమాలను భారత ప్రభుత్వ సాంస్కృతిక విభాగం సభ్యుడు మారం రాజురామచంద్రరావు, సాహితీవేత్తలు డాక్టర్ పురుషోత్తమాచార్యులు, పెరమాళ్ల ఆనందర్, ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎం. రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన స్వేచ్ఛ నాటిక, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో తడకమళ్ళ రామచంద్రరావు దర్శకత్వంలో రూపొందించిన సంధ్యా వెలుగు నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోమలికళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, గౌరవాధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి ఎంఎల్. నర్సింహారావు, ఉపాధ్యక్షుడు జీఎల్. కుమార్, వి. భాస్కర్, హర్షిత్ పాల్గొన్నారు.



కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

నారి చేతిలో సిరిసంపద

● ధాన్యం సేకరణ ద్వారా మహిళా సంఘాలకు భారీగా కమీషన్ ● యాసంగిలో 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ● రూ.3.44 కోట్ల కమీషన్ పొందిన మహిళా సంఘాలు

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అతివలను భాగస్వాములను చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు తీసుకుంటోంది. యాదాద్రిభువనగిరి జిల్లా అధికారులు యాసంగి సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 30శాతం మహిళలకే అప్పగించారు. వారు విజయవంతంగా కేంద్రాలను నిర్వహించి అండగా నిలిచారు. యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయడం, మిల్లులకు తరలించడం లాంటి బాధ్యతలు సమర్థంగా నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి



ధాన్యంకొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు (ఫైల్)

ధాన్యం కొనుగోలులో మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయ సంఘాల సభ్యులు అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటా వేయించి సకాలంలో మిల్లులకు ధాన్యం చేరేలా చూశారు. రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను సకాలంలో వారి ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం, అన్నదాతల మధ్య వారధిలా పనిచేసి ధాన్యం కొనుగోలు చేశారు.

కొనుగోలు చేసిన ధాన్యం ఇలా..

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 321 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 91కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిని స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. గ్రామ సమైక్య సంఘాల ద్వారా అవసరాల మేరకు ముగ్గురు నుంచి ఐదుగురు మహిళా సభ్యులు ఈ కేంద్రాలు నిర్వహించారు. బుక్ కీపర్, తేమ శాతం చూడడం, సీఏ, ఇద్దరు సభ్యులు కొనుగోలు కేంద్రం బాధ్యతలు చూసుకున్నారు. మహిళా సంఘాలకే కేటాయించిన ఐకేపీ సెంటర్ల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకుగాను క్వింటాకు రూ.32 చొప్పున ప్రభుత్వం కమీషన్ చెల్లించింది. మొత్తం రూ.3.44 కోట్లు మహిళా సంఘాల ఖాతాల్లో జమ కానున్నాయి. కమీషన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతర ఖర్చులు పోను 50శాతం డబ్బులు స్త్రీనిధి ఖాతాలో జమ చేస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళా సహాయక సంఘాలకు 51 శాతం కేటాయించాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. వానాకాలం సీజన్‌లో 50 శాతం కేంద్రాలు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలోని శివారెడ్డిగూడెం, పెద్దగూడెం, జూలూరు, గోకారం, కక్కిరేణి, వెల్లంకి, శోభనాద్రిపురం గ్రామాల్లోని కేంద్రాల్లో పెద్దఎత్తున ధాన్యం సేకరించారు.

కొనుగోళ్లలో రాణించి..

ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక మహిళా సంఘాలు కీలకపాత్ర పోషిస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేశాయి. యాసంగి సీజన్‌లో తమకు కేటాయించిన ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ. 3.44 కోట్లు కమీషన్ రూపంలో ఆర్జించాయి. ఇందిరా మహిళా శక్తి పథకాల ద్వారా అతివల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం ధాన్యం సేకరణలోనూ వారికి అవకాశం కల్పించడంతో మహిళా సంఘాలు సత్తా చాటాయి.

రాష్ట్రంలోనే మొదటి స్థానం



ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుంది. వారికిచ్చిన లక్ష్యాన్ని 45రోజుల్లోనే పూర్తి చేశారు. ఒక్క యాసంగి సీజన్‌లోనే కమీషన్ రూ.3.44 కోట్లు ఆర్జించారు. ప్రస్తుతం జిల్లా స్త్రీనిధి బ్యాంకులో ఐకేపీ కేంద్రాల డిపాజిట్లు రూ.12కోట్లు ఉన్నాయి. ఇది రాష్ట్రంలోనే మొదటి స్థానం. ఈ వానాకాలం నుంచి మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం మహిళా సంఘాలకే కేటాయిస్తాం.

● నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి-భువనగిరి జిల్లా

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సైదులు బంధువులు, సైదులు (ఫైల్)

మర్రిగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని మేటి చందాపురం ఇందుర్తి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలంలోని దామర గ్రామానికి చెందిన బత్తుల చంద్రమ్మ, నరసయ్య దంపతుల పెద్ద కుమారుడు బత్తుల సైదులు(25) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బుధవారం మర్రిగూడ మండలంలోని మేటి చందాపురం ఇందుర్తి గ్రామానికి ఓ పని విషయంలో వెళ్లాడు. ఆ గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో క్రిమిసంహారక మందు తాగి అనుమానాస్పదస్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్థులు దగ్గరికి వెళ్లి చూసే సరికి సైదులు మృతిచెంది ఉన్నాడు. గ్రామస్థులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి అతని కోసం ఆరా తీశారు. సైదులు నాంపల్లి మండలంలోని దామర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయం తెలిసిన సైదులు తల్లిదండ్రులు రాత్రి ఏడు గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోలేదని, ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ గురువారం సైదులు తల్లిదండ్రులు, బంధువులు, దామర గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మృతికి కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

తవుడు లోడు లారీ దగ్ధం

వలిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తవుడు లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు టైరు పగిలి తవుడు పాటు లారీ గురువారం దగ్ధమైంది. మహారాష్ట్ర నుంచి తమిళ నాడుకు నుంచి తవుడు లోడుతో వెళ్తున్న లారీ యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పరిధిలోకి చేరగానే ప్రమాదవశాత్తు లారీ టైరు పగిలింది. నిప్పు రవ్వలు ఎగిసి పడి మంటలు అంటుకొని లారీలోని తవుడుతో పాటు లారీ కూడా దగ్ధమైంది. ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.22.90లక్షలు

నార్కట్‌పల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మండలంలోని చెర్వుగట్టు ఆలయ హుండీ ఆదాయం 34 రోజులకు రూ.22.90లక్షలు సమకూరింది. గట్టుకింద అమ్మ వారి హుండీ ఆదాయం రూ.3,59, 890లు, గట్టుపైన స్వామి వారి హుండీ ఆలయం రూ.19,30,740 మొత్తం రూ.22,90,630ల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం ద్వారా రూ.65,120 ఆదాయం వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో నల్లగొండ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్, దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎన్. నవీన్, శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు హెచ్‌డీఎఫ్‌సీ నల్లగొండ బ్రాంచీ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ విశ్వ విద్యాలయం పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ సరళిని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, సీవోఈ ఉపేందర్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కాపీయింగ్ పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ప్రియ, ఇతర అధ్యాపక బృందం ఉన్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

మర్రిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు కడుపు నొప్పితో అస్వస్థతకు గురైన ఘటనలో వసతి గృహం ఫుడ్ ఇన్‌చార్జితో పాటు నర్సు, వార్డెన్(టేకర్) ముగ్గురికి జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం వసతి గృహాన్ని సందర్శించి సిబ్బంది విధి నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో వివరణతో పాటు సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలిగొండ/ రామన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలల్లోని వసతులను పరిశీలించారు. ఇంటర్మీడియట్ కీలకమని వారి భవిష్యత్తు మారుస్తుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకూడదని సూచించారు. ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వలిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతకుమార్, రామన్నపేట జీజేసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసన్నదేవి, అధ్యాపకులు డాక్టర్ పరుశరాములు, కృష్ణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కళాశాలల్లో డ్రాపవుట్లు లేకుండా చూడాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అధ్యాపకులు అడ్మిషన్లు పెంచడంపై దృష్టి సారించాలని, పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులను కలవాలని ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ కళాశాలలకు ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని, ఆయా నిధులతో కళాశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యత, సాంకేతికతతో కూడిన బోధన చేయాలని సూచించారు. క్రీడా పరికరాలు, ప్రాక్టికల్ సామాగ్రి సమకూర్చాలని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో దస్రునాయక్. పాఠశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపకులు కృష్ణకుమారి, జ్యోత్స్న, వరలక్ష్మీ, సంధ్య, సల్మా, మధు, అరిస్టాటిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లు, పురుగుల మందు డబ్బాలతో బాధితుల ఆందోళన



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మిర్యాలగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మొల్కచర్ల గ్రామానికి చెందిన దైద రమణ, దైద శ్రీను కుటుంబసభ్యులు ఉదయం 11 గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు కదిలేదిలేదని భీష్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామం సర్వే నెంబర్ లో తమ పేర పట్టాకలిగిన 153బై 151, 163, 163బై2 లోని మూడు ఎకరాల ఇనాం భూముల ను మాజీ సీఎం వైఎస్ హయాం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. తమ భూమిలోకి అదే గ్రామానికి చెందిన పాతులోతు సుజాత, రాంకోటి రాత్రి సమయాల్లో యంత్రాలు, మంది మార్బలంతో వచ్చి చెట్లు నరికి, భూమి దున్ని కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో అడవి దేవులపల్లి తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆ భూమికి ఆనుకుని ఉన్న మా పేర పట్టాకలిగిన ఇనాం భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి తమ భూములకు, తమకు రక్షణ కల్పించాలని లేకుంటే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని భీష్మించారు. పూర్తిస్థాయి లో విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తానని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు

● రైల్వే గేటు కష్టాలు తప్పినా.. యూటర్న్ టెన్షన్
● ఎవరు ఎటు వెళుతున్నారో తెలియక తికమక
● కనిపించని వేగ నియంత్రణ సూచికలు



హైవే అండర్‌పాస్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న బస్సు, ఇతర వాహనాలు

బీబీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంతో గేటు కష్టాలు తప్పాయనుకుంటే.. హైవే అండర్ పాసింగ్ వద్ద ఫ్లైఓవర్ ముగింపు వద్ద యూటర్న్ పాయింట్ వాహనాదారులను టెన్షన్ పెడుతోంది. వాహనాలు మలుపు తిరిగే క్రమంలో ఎవరు ఎటువైపు వెళ్తున్నారో తెలియక ముచ్చెమటలు పడుతున్నాయి. బ్రిడ్జిపై వేగ నియంత్రణ చర్యలు తీసుకోని కారణంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు

బీబీనగర్ మండలకేంద్రం మీదుగా హైదరాబాద్, భువనగిరి వైపు నిత్యం రాకపోకలు కొనసాగించే సుమారు 50గ్రామాల ప్రజలకు రైల్వే గేటు తిప్పలు తప్పించేందుకు అప్పటి ప్రభుత్వం రైల్వే మార్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించింది. మండలంలోని రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ముందు నుంచి బ్రిడ్జి మొదలై హైదరాబాద్ వైపున హైవే అండర్ పాసింగ్‌లను కలుపుతూ 600మీటర్ల పొడవున ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి ముగింపు వద్ద బీబీనగర్ పాత గ్రామంలోని, బైపాస్ రోడ్డుకు, హైదరాబాద్ వైపుకు వెళ్లే వారి కోసం యూ టర్న్ పాయింట్ పెట్టారు. ఈ ప్రదేశం ఇరుకుగా ఉంటుంది. ఒక వైపు రైల్వే ట్రాక్ మరో వైపు హైవే బ్రిడ్జి సపోర్ట్ వాల్ నిర్మించి ఉన్నాయి. దీంతో పాత బీబీనగర్ గ్రామం వైపు నుంచి పట్టణంలోకి.. పట్టణం నుంచి పాత గ్రామంలోకి నిత్యం రాకపోకలు కొనసాగించే ఆర్టీసీ బస్సు లతో పాటు ఇతర ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సులు యూటర్న్ చేసుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులు, ఇతర పెద్ద వాహనాలు, ఇక్కడ మలుపు తీసుకుంటున్న సమయాల్లో రెండు వైపులా వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఓ వైపు ఎయిమ్స్ ఆసుపత్రి, ఇటు వైపు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు ఉండడంతో వాహనాల రద్దీ పెరిగింది. బ్రిడ్జిపై నుంచి పట్టణంలోకి ప్రవేశంతో పోచంపల్లి చౌరస్తా వాహనాల సందడి ఉంటుంది. నాలుగు వైపులా నుంచి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ వాహనాల క్రమబద్దీకరణ వేగ నియంత్రణకు ఎలాంటి చర్యలు సూచికలు లేని కారణంగా వాహనాదారులు తికమక పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



రైల్వే బ్రిడ్జిపై వేగ నియంత్రణ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పోచంపల్లి చౌరస్తాలో, హైవే, హైదరాబాద్ వైపు, హైవే అండర్ పాసింగ్ దగ్గర యూటర్న్ వద్ద వాహనదారులను నియంత్రించే వ్యవస్థ లేక ఎవరు ఎటు వైపు వెళ్తారో గమనించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

దేవరుప్పుల పృథ్వీకుమార్, బీబీనగర్.

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి,



తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.

ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వుంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220

ఆలయ దర్శనం



యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, అర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

> **ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.**

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎన్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్‌ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు.



అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.

అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



దైవమార్గం

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తాకోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్తులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,

> **అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.**



వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కొషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క అతను వెళ్ళి పోతూ ఉంటే... రోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్షిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి (కలెక్టరేట్), జూలై 17 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ స్టడీ సర్కిల్ ద్వారా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో హైదరాబాదులో అందజేసే నెల రోజుల ఉచిత శిక్షణ, ఉపాధి కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి పీ.యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 సంవత్సరాల లోపు వారు ఆగస్టు 18లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు నూతన రేషన్‌కార్డుల పంపిణీ

యాదగిరిగుట్ట రూరల్, 17, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మండలానికి నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను ఈ నెల 18న మధ్యాహ్నం 2గంటలకు కొత్తగుండ్లపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఫంక్షన్‌హాల్‌లో పంపిణీ చేయన్నున్నట్లు తహసీల్దార్ గణేష్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుల అందజేతకు కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం


శిథిలావస్థకు చేరిన రామన్నపేట తహసీల్దార్ కారాలయ భవనం

రామన్నపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. 45 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం పైకప్పు పెచ్చులూడి, కొద్దిపాటి వర్షానికి కురుస్తోంది. గోడలు బీటలువారి చెట్లు మొలుస్తున్నాయి. భవనానికి మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షం కురుస్తున్నప్పుడు వరద నీరు కార్యాలయ ఆవరణలో నిలుస్తోంది. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన మహిళలు మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కార్యాలయ పని నిమిత్తం వచ్చిన ప్రజలు వెయిటింగ్ రూమ్ కానీ, కూర్చోడానికి కనీసం కుర్చీలు లేకపోవడంతో చెట్లు కింద నిరీక్షించవలసి వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని అన్ని వసతులతో కూడిన నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


భవనంపైకప్పుపై చెట్లు మొస్తున్న దృశ్యం

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం


హన్మాపురంలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో దినకర్

భువనగిరి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో మొక్కలను నాట డా నికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. వర్షాభావం కారణంగా కొద్దిగా ఆలస్యమైన అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భువనగిరి మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 1,12,200 మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నారు. ఆసక్తి ఉన్నవారికి 7వేల పండ్ల మొ క్కలను సొంత స్థలంలో నాటితే పూర్తి రాయితీతో పాటు నిర్వహణకు డబ్బులు ఉపాధి హామీ పథకం కింద చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఇంటింటికీ పంపిణీ..

వనమహోత్సవంలో భాగంగా ప్రజలను భాగస్వా ములను చేయాలనే ప్రభుత్వ సూచన మేరకు అధికారులు ఇంటింటికీ పండ్లు, పూల నీడ నిచ్చే మొక్కలను అందించేందుకు మండలంలో 40వేల మొక్కలను సిద్ధం చేశారు. ఇందులో ప్రత్యేకంగా పండ్ల తో టలను పెట్టుకునే వారికి పూర్తి సబ్సిడీపై రైతుల కోరిక మేరకు అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రతీ మొక్కకు మూడేళ్ల పాటు నిర్వహణకు ఒక్కో మొక్కకు రూ.40 ఉపాధి హామీ ద్వారా చెల్లించనున్నారు.

రహదారులు, ఖాళీ స్థలాల్లో..

వనమహోత్సవంలో రహదారుల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్, ఖాళీ ప్రదేశాలు, పాఠశాలలు, ప్రభుత్వ స్థలాల్లో మొత్తం 47వేల మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు. మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాలను ఎంపిక చేసి ఇప్పటికే 40వేల పై చీలుకు గుంతలు తీశారు.

12వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక

మండలంలో 12వేల మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ, ఉద్యానవన ,అటవీశాఖల ఆధ్వర్యంలో మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. వర్షాభావ పరిస్థితుల్లో కొంత ఆలస్యమైనా వారం రోజుల్లోగా పెద్ద ఎత్తున మొక్కలను నాటేందుకు మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇచ్చాం. ప్రజలు ముందుకు వచ్చి వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

-చిల్కూరి శ్రీనివాస్, ఎంపీడీవో భువనగిరి

ఫిట్‌నెస్‌లేని బస్సులను సీజ్ చేయాలి

భువనగిరి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్‌లేని ప్రైవేటు పాఠశాలల బస్సులను సీజ్ చేసి పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా రవాణశాఖ అధికారి సాయికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాల బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని, అనుభవం లేని డ్రైవర్లతో స్కూల్ బస్సులను నడిపిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ సందీప్, వినయ్, వంశీ ఉన్నారు.

18వ వార్డులో సమస్యలను పరిష్కరించాలి

చౌటుప్పల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని 18వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హనుమాన్‌నగర్ కాలనీ వాసులు కోరారు. సమస్యలపై గురువారం మునిసిపల్ కమీషనర్ వెంకట్రామ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కోతులు, కుక్కల బెడద అధికమైందని, వీదులలో తిరగలేని పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు.

మోస్తరు వర్షానికే కూలిన మురికి కాల్వ

● *నాణ్యతా లోపమే కారణమంటూ ప్రజల ఆగ్రహం*


ఇందిరానగర్ కాలనీ ఎదురుగా కూలిన మురికి కాల్వ

మోత్కూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీలో ఇందిరానగర్ కాలనీ ఎదురుగా నార్కట్‌పల్లి రోడ్డు వెంట ఇటీవల కొత్తగా మురికి కాల్వ నిర్మించారు. గురువారం మధ్యాహ్నం మోత్కూరులో కురిసిన ఓ మోస్తరు వర్షానికి ఆ కాల్వ ఒక వైపు (గోడ) సుమారు 80 మీటర్ల పొడవు కూలిపోయింది. ఒక వైపు (గోడ) కూలి రెండోవైపు ఉన్నదానిపై పడటంతో అదికూడా దెబ్బతిన్నదంటున్నారు. దీంతో మురికి కాల్వ నిర్మాణ నాణ్యతలోని డొల్ల తనం బయట పడినట్టయ్యింది. మురికి కాల్వల నిర్మాణం జరిగేప్పుడు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించడం లేదని, కాంట్రాక్టర్ తగు పాళ్లలో సిమెంటు కలపకుండా ఇష్టారాజ్యంగా నిర్మిస్తూ, క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మురికి కాల్వ నిర్మాణం కోసం కొంత వెడల్పుగా గాతు తీస్తారని, కాల్వ నిర్మాణం జరిగాక కాల్వకు ఇరువైపులా గాతులో ఖాళీ స్థలాన్ని మట్టితో నింపుతారు. గురువారం కురిసిన వర్షానికి మట్టి తడిసి బరువు పెట్టినట్టు కావడంతో మురికి కాల్వ గోడ కూలిందంటున్నారు. ఓ మోస్తరు వర్షానికే ఒక వైపు కూలితే భారీ వర్షాలు కురిస్తే కొత్తగా నిర్మించిన మురికి కాల్వలు ఉంటాయా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూలిన మురికి కాల్వకు ఇప్పటికే బిల్లు చెల్లిస్తే కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని, బిల్లు చెల్లించనట్టయితే అతని చేతనే తిరిగి నాణ్యతగా నిర్మింపజేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతోనే..



మునిసిపల్ పాలక వర్గాన్ని, అధికారులను ఎంతో కాలం అడగ్గా, ఎదురు చూడగా ఇటీవల మోత్కూరు ఇందిరానగర్ కాలనీ ఎదురుగా కొత్తగా మురికి కాల్వ నిర్మించారు. ఇంకా అందులోంచి మురికి నీరు పారనేలేదు. గురువారం మధ్యాహ్నం కురిసిన తేలిక పాటి వర్షానికే ఒక వైపు పూర్తిగా కూలి రెండో వైపు గోడపై పడటంతో అదికూడా దెబ్బతిన్నది. మురికి కాల్వలు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించడంతో పాటు క్యూరింగ్ చేయడం లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకుండా అతనితోనే పునర్నిర్మింప జేయాలి.

-దాసరి తిరుమలేష్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు, మోత్కూరు

22న చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సమావేశం

చౌటుప్పల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13వ తేదీన నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భువనగిరిలో ఈ నెల 22న చేయూత పెన్షన్ దారుల సన్నహాక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, చేయూత పెన్షన్‌లను పెంచాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొడ్డు శ్రావణ్, ఎర్ర వీరన్న, సాయిరెడ్డి రామ్ రెడ్డి, బి. అలివేలు, అంజయ్య, ప్రభాకర్, లింగస్వామి, అనిల్ కుమార్, శంకర్, శ్రీనివాస్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండిని కలిసిన గూడూరు

బీబీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణ రెడ్డి గురువారం కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ ఆసుపత్రిలో త్వరితగతిన ఐపీ సేవలు ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని కోరినట్లు గూడూరు తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

ఆత్మకూరు(ఎం), జూన్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో కూలీలకు బిల్లులు చెల్లింపు విషయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి జి.సురేష్ హెచ్చరించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో చేపట్టిన రూ.4.32కోట్ల పనులపై సామాజిక తనిఖీ బృందం చేసిన సర్వే నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించారు. కూలీలకు కూలి చెల్లింపులో రూ.15004పై అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి, విజిలెన్స్ మేనేజర్ ఆదిత్యవర్ధన్, ఎంపీడీవో రాములునాయక్, ఎస్ఆర్‌పీ నర్సయ్య, ఏపీవో రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

భూదాన్‌పోచంపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సందర్శించి, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. పాఠశాల ఆవరణలో తిరిగి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ ప్రకారం నిత్యం ఆహార పదార్థాలు రుచిగా, నాణ్యతగా తయారు చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు సాలమ్మ మాట్లాడుతూ బిల్లులు సకాలంలో అందించాలని, వంట చేయడానికి షెడ్ నిర్మాణం చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఎంఈవో ప్రభాకర్, హెచ్ఎం రాజారెడ్డి ఉపాధ్యాయులు నర్సింహారావు పాల్గొన్నారు. అనంతరం భూదాన్‌పోచంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఆర్డీవో పరిశీలించారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ శ్రీవాణి


ప్రశంసాపత్రం, షీల్డ్ అందుకుంటున్న డాక్టర్ శ్రీవాణి

భూదాన్ పోచంపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీవాణికి ఉత్తమ వైద్యాధికారిగా కలెక్టర్ హనుమంతరావు అవార్డు ప్రదానం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవాణికి ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రం, షీల్డు కలెక్టర్ అందజేశారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జలాల్‌పూర్ ఉపకేంద్రం ఆరోగ్య కార్యకర్త సుమతి, ఆశా కార్యకర్త పద్మలకు ఆయన ప్రశంసాపత్రం అందజేశారు.

చదువే ప్రగతికి మూలం: కార్వాన్ ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మొయిుద్దీన్

భువనగిరి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చదువే ప్రగతికి మూలమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయిుద్దీన్ అన్నారు. మైనార్టీస్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భువనగిరిలో ఆయన విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు తదితర విద్యాసామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. ఏ రంగంలోనైనా చదువుకోని వారితో పోలిస్తే విద్యావంతులే ముందంజలో ఉంటారని, ఇందుకు ప్రధాన కారణం వారిలో ఉండే విజ్ఞానం, అవగాహన సామర్థ్యమే కారణమని అన్నారు. విద్యార్థి దశలో కష్టపడితే భవిష్యత్తు జీవితం ఒత్తిడి లేకుండా సాగించవచ్చునని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ.అవేజ్‌చిస్తీ, కమిటీ చైర్మన్ అబ్దుల్ హఫీజ్ వసీం, మునిసిపల్ మాజీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిటీ ప్రతినిధులు సయ్యద్ ఇఫ్తేకార్ ఫహీం, ఎండీ మజార్, ఎండీ.అతహర్, ఎండీ.లయాక్ అహ్మద్, ఎండీ.జావీద్ ఖాద్రి, మొయినుద్దీన్, అబ్దుల్ ఘని, సుజాయుద్దీన్, శంషుద్దీన్, షహీద్ పాల్గొన్నారు.

'దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి'

భువనగిరి (కలెక్టరేట్)/భువనగిరి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల పింఛన్ విడుదల చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు జిల్లా బాలరాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో దివ్యాంగులకు 5 శాతం వాటా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్వామి, లలిత, పార్వతి, అంజయ్య, యాదగిరి, వెంకటేశ్వర్లు, గోపి, లింగం, శ్రీహరి తదితరులున్నారు. కాగా దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్ద రాజేశ్ డిమాండ్‌చేశారు. భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పింఛన్‌దారుల జిల్లా సదస్సుకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమితి జాతీయ కార్యదర్శి గడ్డం కాసీం, కరుణాకర్ పాల్గొన్నారు.

జీడికల్ నుంచి జగద్గిరిగుట్టకు బస్సు ప్రారంభం

ఆలేరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోరిక మేరకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశానుసారం గురువారం శార్బనాపురంలో డీఎం హరి బస్సు సర్వీస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి డిపోకు చెందిన ఈ బస్సు జగద్గిరిగుట్ట నుండి ఆలేరు మీదుగా బహదూర్‌పేట, మంతాపూరి, దిలవార్‌పూర్, ఇక్కుర్తి, శార్బానపురం, మాటూరు, అమనబోలు, గొలనుకొండ మీదుగా జనగామ జిల్లా జీడికల్‌కు వెళ్తుందన్నారు. ఈ బస్సు సర్వీస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీపో సీఐ శ్రీలత, ఏడీసీ సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు బుగ్గ నవీన్, జన్నె సిద్దులు, బాలకృష్ణ, రమేష్, సారయ్య, మధు, రాజు, కుమార్, సత్యరాజయ్య, యాదగిరి పాల్గొన్నారు.

కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వాలి: దేవేందర్‌రెడ్డి

భువనగిరి గంజ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి జిల్లా ఆసుపత్రిలో (ఏఐటీయూసీ అనుబంధం) సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న శానిటేషన్ టెండర్ కాలపరిమితి వచ్చే నెల ముగుస్తుండడంతో వెంటనే కొత్త టెండర్లను పిలిచి, ప్రతీ కార్మికుడికీ రూ.26వేలు కనీస వేతనం వచ్చే విధంగా రాష్ట్రం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్, కార్మికులు గుండు వాణి, మెడబోయిన లక్ష్మమ్మ, జెరిపోతుల కమలమ్మ, నీలం నరసింహ, బట్టుపల్లి లావణ్య, బట్టు కృష్ణవేణి, భారతమ్మ, నాగరాణి, శారద, విజయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి: పాండు

భువనగిరి గంజ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న మునిసిపల్ కాంట్రాక్టు కార్మికలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలో సీఐటీయూ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి మాయకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. కార్మికులకు బకాయిగా ఉన్న వేతనాలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రామచంద్ర‌ర్, వెంకటేశం, ఐలయ్య, రవి, శాంతికుమార్, రాణి, లక్ష్మీ, శాంతమ్మ, వరమ్మ పాల్గొన్నారు.

నాలాలో మట్టి తొలగింపు.. సద్దుమణిగిన వివాదం


నాలా ప్రాంతంలో మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చౌటుప్పల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డులో గురువారం సాయంత్రం నాలా ప్రాంతాన్ని అధికారులు గుర్తించి మట్టిని తొలగించడంతో వివాదం సద్దుమణిగింది. కొంత కాలంగా వివాదాలకు నిలయంగా మారిన నాలాను ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వీరాబాయి, మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి, నీటి పారుదల శాఖ డీఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. వలిగొండకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు లోని కల్వర్టు నుంచి పడమర దిశ లో 40 అడుగుల వెడల్పుతో సుమారు 200 మీటర్ల పొడవుతో మట్టిని తొలగించి మురుగు కాల్వను శుభ్రం చేయించారు. 40 అడుగుల వెడల్పుతో మురుగు కాల్వ నుంచి మట్టిని తొలగించిన సంఘటనతో అందులో కొన్ని ప్లాట్లు కనుమరుగయ్యాయి. నాలాను ఆక్రమించి అక్రమ కట్టడాలు చేస్తుండడంతో వివాదం మొదలైంది. అనేక మందితో పాటు, బీజేపీ నాయకులు చేసిన ఫిర్యాదులతో అధికారులు స్పందించి నాలా ప్రాంతాన్ని సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఆక్రమణ ప్రాంతంలో మట్టిని తొలగించారు. ఈ పరిశీలనలో మండల సర్వేయర్ మురళీధరన్, టీపీవో శివ, ఆర్ఐ కే.సుధాకర్‌రావు పాల్గొన్నారు. కాగా చౌటుప్పల్ పట్టణంలోని నాలా ప్రాంతాలను ఆక్రమించి అక్రమ కట్టడాలను చేపట్టే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని ఆర్డీవో శేఖర్‌రెడ్డి హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ నజర్

(5వ పేజీ తరువాయి)

లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టాలంటే తప్పకుండా హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), వైటీడీఏల అనుమతి పొందాలి. అయితే శివారు గ్రామాల్లో హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి సాంకేతిక అనుమతులు తీసుకోకుండానే పలు చోట్ల లేఅవుట్లను ఏర్పాటుచేశారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చాలంటే ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. భూమి మార్పిడి చేపట్టకుండా, హెచ్ఎండీఏ, వైటీడీఏ నుంచి అనుమతులు లేకుండానే అక్రమంగా లేఅవుట్లను తయారుచేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘించారు. ఇదే అదునుగా భావించి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు డబ్బులకు ఆశపడి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నగరశివారు ప్రాంతాల్లో పదేళ్ల నుంచి ఇదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.

23, 24తేదీల్లో వ్యకాస రాష్ట్ర కమిటీ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

బీబీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ మండల కేంద్రంలో ఈనెల 23, 24 తేదీల్లో వ్యవసాయ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తెలిపారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీబీనగర్‌లో నిర్వహించబోయే సమావేశానికి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ హాజరు కాబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కొండమడుగు నర్సింహ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

వలిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో జలంధర్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోని వెల్వర్తి, మొగిలిపాక, కేర్చుపల్లి, పులిగిల్ల, కంచెన్నపల్లి, దాసిరెడ్డిగూడెం గ్రామాల్లో శానిటేషన్, ఉపాధిహామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించా రు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు నరేందర్, సైదులు, స్నేహలత, మత్స్యగిరి, పావని పాల్గొన్నారు.

నేడు, రేపు కృష్ణా జలాల సరఫరా నిలిపివేత

చౌటుప్పల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 18, 19తేదీల్లో కృష్ణాజలాల సరఫరా నిలిచిపోనుంది. నియోజకవర్గంలోని నాంపల్లి మండలం లింగోటం గ్రామంలో మిషన్ భగీరథ పథకం కృష్ణా జలాల శుద్ధీకరణ ప్లాంట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించే పనులను చేపడుతున్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని పలు వార్డులకు కృష్ణా జలాల సరఫరా నిలివేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ పథకం తాగు నీటి సరఫరా నిలిచిపోతున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేస్తామని తెలిపారు. నీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా సరే హెల్ప్ డెస్క్ నంబరులు (సంతోష్) 7799883937, (సునీల్) 7013594121 కు కాల్ చేయాలని ఆయన సూచించారు. అంతరాయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని, రెండు రోజుల పాటు నీటిని పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ


పుస్తకాలు అందజేస్తున్న మల్లికార్జున్

వలిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కవి రెబ్బ మల్లికార్జున్ స్థానిక శాఖ గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించారు. ఆచార్య డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య జీవిత చరిత్రతో పాటు ఇతర తెలుగు సాహిత్య పుస్తకాలను అందజేశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ పుస్తకాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, అంజనేయులు, ఉపాధ్యాయులు స్వామి, సాయి తేజ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి

రామన్నపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం మండల కార్యాలయంలో గ్రామశాఖ కార్యదర్శుల సమావేశం ఆనగంటి నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల గ్రామాల్లో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతూ, మతోన్మాద ధోరణితో గ్రామీణ ప్రాంతాల్లో ముందుకొస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ల నరసింహాచారి, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, మండల కమిటీ సభ్యులు గన్నెబోయిన విజయభాస్కర్, వేములు సైదులు, ముషం నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యానికి సన్మానం

యాదగిరిగుట్ట రూరల్, జూలై 17, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులు పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోధర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఏఐటీయుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరేటి రాములు, ఎండి. ఇమ్రాన్, చెక్క వెంకటేష్, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

గురుకులంలో లీగల్ టీమ్ సభ్యుల ఆకస్మిక తనిఖీ

రామన్నపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో భాగంగా లీగల్ టీమ్ సభ్యుడు బత్తుల గణేష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కె.రాజు సమక్షంలో విద్యార్థులకు కల్పించే భోజన సదుపాయాన్ని పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత, వంట గది, మరుగుదొడ్లు, ఇతర సమస్యలు ఉంటే లీగల్ టీమ్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వనదేవతలకు నీళ్ల ఆరగింపు


జలబిందెలతో వెళుతున్న మహిళలు

రామన్నపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరుణదేవా కరునించాలంటూ మండలంలోని జనంపల్లి గ్రామంలో గురువారం మహిళలు బతుకమ్మ ఆడారు. వనదేవతలకు నీళ్ళ ఆరగింపు చేసి వేడుకన్నారు. వరుణ దేవుడు కరుణిస్తేనే వర్షాలు కురుస్తాయని పలువరు పేర్కొన్నారు. నంతరం ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా మహిళలు చుట్టు కాముడు వేస్తూ వరుణదేవుడు, గంగమ్మ తల్లి పాటలు పాడారు.